# పద్మవ్యూహంలో పతివ్రతలు

- రావినూతల సువర్ణాకన్నన్



రాత్రి ఎనిమిది గంటలయింది. డిశంబర్‌నెల, అందునా అంతక్రితం రాత్రి ఉరుములతోనూ, పిడుగుల తోనూ అకాల వడగళ్ళ వాన పడి, వాతావరణం హిమాలయాలని తలపిస్తోంది. చలికి దడిసిన జనం ఇళ్ళల్లోకి చేరిపోయారు.

విశ్వం మాత్రం బేంక్‌లో తలపట్టుక్కూర్చున్నాడు. నిజానికి ఆ బేంక్ అన్ని బేంక్స్‌లోలా పదింటిదాకా పని చెయ్యదు. ఆరోజు ఏదో ఇన్స్‌పెక్షన్ వున్నందువల్లా, విశ్వం మేనేజర్ అవడం వల్లా అంత దాకా వుండాల్సొచ్చింది.

"సార్ చాయ్ తెమ్మంటారా?" అతన్ని చూసిన ప్యూన్ వినయంగా అడిగాడు. తల అడ్డంగా వూపి, మరో పది నిమిషాల తర్వాత సీట్లోంచి లేచి, మిగతావాళ్ళకి ఏదో చెప్పి బైటికొచ్చాడు విశ్వం. స్కూటర్ ఓ పోష్ ఏరియాలో వున్న కాంప్లెక్స్ ఆవరణలో ఆగింది.

అతనికి విపరీతమైన అలసటగాను, ఆకలిగాను వుంది. చలి మరింత బాధపెడుతోంది.

"ఛ! కారువస్తే బావుండేది"! అనుకున్నాడు విసుగ్గా, అతను మేనేజరైన వెంటనే కారుకి ఆర్డరిచ్చాడు. అంతకు ముందే మంచి లొకాలిటీలో ఫ్లాట్ కొన్నాడు. ముచ్చటగా ఇద్దరు పిల్లలు అందమైన భార్య! జీవితం వడ్డించిన విస్తరిలా వుంది. అయినా అతనికి ప్రశాంతత లేదు.

విశ్వం కోటుతీస్తూ లిఫ్ట్‌కేసి నడిచాడు.. అప్పుడే అతని ఆరేళ్ళపిల్లలు లవకుశలు తండ్రిని చూసి బావురుమంటూ అతన్నల్లుకు పోయారు.

చలిలో వణుకుతూ ఇక్కడ కూర్చుని, తనని చూడగానే బావురుమంటున్న పిల్లల్ని చూసి కంగారు పడిపోయాడు.

"ఏం జరిగింది నాన్నా? ఇంత చలిలో బైటికెందుకొచ్చారు అన్నాడు. ఇద్దర్నీ పొదివి పట్టుకుని "అమ్మ...." దుఃఖంతో మాట రావడంలేదు వాళ్ళకి. అతను మరింత హడిలిపోయాడు.

పాఠకులకు చిరపరిచితమైన ఈ రచయిత్రి మహిళల వ్యక్తిత్వాన్ని మహోన్నతంగా చూపెట్టే ఎన్నో కథలకు, నవలలకు శ్రీకారం చుట్టడం విశేషం. లబ్ధ ప్రతిష్ఠమైన ఈవిడ రచనా వ్యాసంగం ఎన్నో మంచి పాత్రలకు శ్రీకారం చుట్టింది.

నదుల పేర్లను తీసుకొని వాటికి స్త్రీయత్వాన్ని అద్ది సశ్యామలం చేసే స్వభావ నేపథ్యాన్ని స్త్రీ సహజ సిద్ధ వ్యక్తిత్వంగా మలచటం రావినూతల సువర్ణాకన్నన్ విశేషం.

సీనియర్ రచయిత్రియైనా, చినుకు పాఠకుల కోసం చాలా ఉత్సాహంగా, ప్రోత్సాహంగా ఈ వ్యంగ్య కథని అడిగిన వెంటనే పంపించడం ఈ రచయిత్రి యొక్క స్నేహ స్వభావం.

"అమ్మకేమైంది?" అన్నాడు ఆత్రుతగా లిఫ్ట్‌లోకి నడుస్తూ "అమ్మకేం కాలేదు నాన్నా! ఎవరో చచ్చిపోయారట అమ్మ ఏడుస్తోంది". ఎలాగో గొంతు పెకల్చుకుని చెప్పాడు లవుడు. తృళ్ళి పడ్డాడు విశ్వం

"ఏమిటి? అంటూ కంగారుగా ఇంట్లోకి నడిచాడు.

ఇల్లంతా చిందర వందరగా వుంది. అతని భార్య సోఫాలో కూలబడి కళ్ళు తుడుచుకుంటోంది. ఏదేదో వాగుతున్న టి.వి.ని ఆఫ్ చేసి-

"ఏమైంది గంగా?" అన్నాడు భయంభయంగా

అంతే! గంగ దుఃఖం రెట్టింపయింది. గభాల్న లేచి భర్తని పట్టుకుని,

"అనసూయ చచ్చి పోయిందండీ!"

అంది బావురుమంటూ అనసూయ గంగ పిన్ని కూతురు. ఆమె విశ్వానిక్కూడా బాగా తెలుసు.

"అరె! అనసూయ పోయిందా ఆ మధ్య ఆ పిల్ల పెళ్ళిక్కూడా వెళ్ళాంకదా, ఇంతలో ఏమైంది? ఇంతకీ ఎలాపోయింది? అన్నాడు ఆమెని సోఫాలో కూర్చోపెట్టి కళ్ళు తుడుస్తూ.

ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి.

"అదేనండీ అనసూయ భర్త, అత్తగారు కలిసి కాల్చి చంపేశారు. పెళ్ళయిందగ్గర్నించీ కట్నం కోసం పీడించి, ఆమె తేనంటే బలవంతంగా చంపేశారు" మళ్ళీ బావురుమంది.

ఈసారి మరింత కొయ్యబారి పోయాడు విశ్వం. "కానీ వాళ్ళలాంటి వాళ్ళుకారే., ఏమిటో డబ్బు ఎంత పనైనా చేయిస్తుంది. పద వెళ్దాం. పాపం! ఓసారి చూసొద్దాం" అన్నాడు అనునయంగా. అతని ఆకలి, అలసట ఎగిరిపోయాయి.

"ఎక్కడికి"? అందామె కళ్ళు తుడుచుకుంటూ "ఇంకెక్కడికి, మీ అనసూయావాళ్ళు ఈవూళ్లోకదా ఉండేది. ఓసారి పలకరించివద్దాం! పాపం., ఎంతైనా ఆమె నీకు చెల్లెలేగా" ఓదార్పుగా అన్నాడు విశ్వం.

ఆమె ఓసారి అతనికేసి పిచ్చిదానిలా చూసింది. "పోయింది ఎవరనుకుంటున్నారు? అంది కళ్ళు విశాలం చేస్తూ.

"అదే.. మీ పిన్ని కూతురు అనసూయ...."

"ఛీ! అది పోవడం ఏంటి అది దుక్కలావుంది. అయినా అది పోతే ఇంతలా ఏడుస్తానా! అంది గంగ లేస్తూ.. "మరే. అనసూయ పోయింది" బిత్తర పోయాడతను. అదేనండీ 'పద్మవ్యూహంలో పతివ్రత' అన్న సీరియల్ లేదు! అందులోని కొత్తకోడలు అనసూయ,"మళ్ళీ బావురుమంది గంగ.

విశ్వానికి మూర్ఛవచ్చినంత పనయింది. టి.వి. సీరియల్‌లోని పాత్ర పోయిందనా ..... ఇంతలా సోకాలు పెడుతున్నావే!" అతని గొంతు ఆవేశంతో ఒణికింది.

ఆ మాటకి గంగకి పిచ్చకోపంవచ్చింది.

టి.వి. సీరియల్‌లో పాత్ర అని అంతతేలిగ్గా తీసిపారెయ్యకండి. అసలా అనసూయ...." అంటూ మళ్ళీ సోకాలు మొదలు పెట్టింది. పిల్లల ఏడుపు, గంగ గందరగోళం విన్న అపార్ట్‌మెంట్స్ ఆడవాళ్ళందరూ చేరిపోయారు. ఆడవాళ్ళు ఆమె చుట్టూ చేరిముక్కులు చీదుకున్నారు. కళ్ళు ఒత్తుకున్నారు. ఇదంతా చాలా చిరాగ్గా వుంది. విశ్వానికి, విశ్వానికే కాదు సదరు ఆడవాళ్ళ భర్తలక్కూడా.

ఎలాగో సర్దిచెప్పి అందర్నీ బైటికి పంపేసి "సరే! పెట్టిన సోకాలు చాలు, ఆకలేస్తోంది అన్నం పెట్టు" అన్నాడు విశ్వం ఆవేశాన్ని అతి ప్రయాసగా అణుచుకుంటూ. గంగ మొహం వెలవెలపోయింది.

"సారీ! అనసూయ పోయిన దుఃఖంలో వంట చెయ్యలేదండీ వుండండి క్షణంలో చేస్తాను" అంటూ

వంటింటి కేసి నడిచింది.

అతని కళ్ళు నెత్తురు ముద్దలే అయ్యాయి. "మరి పిల్లలేం తిన్నారు?" అన్నాడు ఆవేశంగా

"ఏం తిన్లేదు." గొణిగిందామె.

"అవున్నాన్నా! ఆవిడెవరో చచ్చిపోయిందని ఏడుస్తూండి పోయింది. మాకు పాలు కూడా ఇవ్వలేదు. మాకు భయమేసి బైటికెళ్ళిపోయాం" అన్నారు పిల్లలు నీరసంగా

విశ్వానికి ఆవేశం, ఆవేదన, నీరసంపెరిగి పోయాయి. వారిస్తున్న భార్యని ఒక్కతోపు తోసి, బైటికెళ్ళి కేరియర్ భోజనం తెచ్చి, తనుతిన్నా ననిపించి, పిల్లలిద్దరికీ పెట్టి మంచం మీదవాలాడు స్నానం కూడా చెయ్యకుండా. అతన్ని పలకరించే ధైర్యం గంగకి లేదు. అయినా -

" ఈ టి.వి.ని తిట్టడం కొత్తా ఏమిటీ," అని దులిపేసుకొని అన్నం తినేసి మంచంమీద వాలి పోయింది. ఆరాత్రంతా అనసూయ చావుగురించిన కలలే కన్నది.

\- - -

**వా**రంరోజుల తర్వాత ఆ అపార్ట్‌మెంట్‌లోని మగాళ్ళందరికీ ఓ మెసేజ్ పాసయింది. అదీ ఆడవాళ్ళకి తెలియకుండా అనుకున్న ప్రకారం ఆదివారం ఉదయం ఎక్కడికో అనిచెప్పి మగాళ్ళంతా ఓ పెద్దపార్కుకి వెళ్ళి కూర్చున్నారు. అందరూ టి.వి. బాధితులేమరి!

"విషయం టి.వి. సీరియల్స్‌ని గురించని మీ అందరికీ తెలుసుగా," సంభాషణకి నాంది పలికాడు విశ్వం.

" తెలుసు," అన్నాడు పక్క ఫ్లాట్ సుబ్బారావు నీరసంగా 'టి.వి.లో అదెవత్తో చచ్చిపోయిందని మా ఆవిడ చేసిన జాతరకూడా తెలుసుగా.

"మీ ఆవిడ నయం బ్రదర్, ఆ మధ్య 'స్మశానంలో పెళ్ళిచూపులు'' సీరియల్‌లో పెళ్ళికూతురు కట్టుకున్న చీరలాంటిది కావాలని వూరంతా తిరిగింది మా ఆవిడ అదోలా నిట్టూరుస్తూ అన్నాడు మరో బాధితుడు.

'నాబాధ ముందు మీబాధేపాటిది ఓఛానల్లో తగలడుతున్న "ముట్టుకుంటే మూర్ఛపోతావ్" సీరియల్‌లో హీరోకి కొన్ని పవర్స్ ఉన్నాయి. ఆ పవర్స్ అన్నీ ఎలాసంపాదించాలా అని మా ఆవిడా, పిల్లలూ కూడా మంత్రతంత్రాల పుస్తకాలు, దెయ్యాల భూతాల కథలూ తెచ్చుకుని చదివి, తెల్లవార్లూ పిచ్చి కేకలతో నాకు నిద్ర, మనశ్శాంతి కూడా లేకుండా చేస్తున్నారు! దాదాపు ఏడుస్తున్నట్టు అన్నాడింకో అతను.

ఇలా ఎవరి బాధలు వాళ్ళు చెప్పుకున్నాక ఆబాధల్నించి ఎలా తప్పించుకోవాలా అన్న చర్చలో పడ్డారు. సీరియల్ చూడకుండా వాళ్ళుండరు. కేబుల్ కనెక్షన్ తీసేస్తే నిరాహారాదీక్షలు! ఇకమనం చెయ్యాల్సిందల్లా ఆ ఛానల్స్ వాళ్ళకాళ్ళమీద పడాలి అలాంటి సీరియల్స్ వెయ్యద్దని, అన్నాడు విశ్వం.

ఇలాంటి పిచ్చి ప్రేక్షకులున్నంత కాలం వాళ్ళా పరు! చూస్తూ చూస్తూ లక్షల్ని వదులుకుంటారా," అన్నాడు సుబ్బారావు నీరసంగా .ఎన్నివిధాలుగా ఆలోచించినా వారికి టి.వి.సీరియల్స్ విమోచనం కలిగేలా అనిపించలేదు.

"ఆ ఓ అయిడియా! అరిచినట్టు అన్నాడు ఓ పోలీసాఫీసరూ, ధైర్యవంతుడూ అయిన రాజేష్.

అందరూ అతనికేసి ఆశగా, ఆతృతగా చూశారు. ఆ టి.వి సీరియల్స్‌ని ఆపగలిగే శక్తి ముఖ్యంగా "పద్మవ్యూహంలో పతివ్రత" అన్న సీరియల్ నిలిపి వేయగలశక్తి మా ఫ్రెండ్ లంబోదరునికుంది. ఆపిస్తాడుకూడా ఎందుకంటే ఆ సీరియల్ నిర్మాతలకీ, డైరక్టర్‌కీ అతనికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత శత్రుత్వం వుంది. లంబోదరానికి అన్ని ఛానల్స్ వాళ్ళతోనూ పరిచయాలున్నాయి! అన్నాడు రాజేష్.

"ఆ పని చెయ్యండి బాబూ

## సరదా

సరదాలకు జరదాలేస్తాం

చుట్టూరా బురదే పూస్తాం

నెయ్యానికి ప్రాణాలిస్తాం

కయ్యానికి ప్రాణాల్ తీస్తాం

\- నేతి లక్ష్మీ ప్రసాద్

చెన్నై

ఆ పద్మవ్యూహంలో సీరియల్ మూడువందల ఎపిసోడ్స్, అయ్యాయి. కథా కాకర కాయ లేదు. ఇంకా యాభై భాగాలు వ్రాయట. ఆయాభై పూర్తయే సరికి మనందరికీ పిచ్చెక్కడం ఖాయం", అన్నాడు సుబ్బారావు ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ

తర్వాత అంతా కూడబలుక్కుని ఓనిర్ణయాని కొచ్చారు. అంతేకాదు నాలుగురోజుల తర్వాత పిప్పళ్ళబస్తా లాంటి ఓయాంకర్ కళ్ళూ, ఒళ్ళూ తిప్పుతూ రానికన్నీళ్ళు ఒత్తుకుంటూ

'అనివార్యకారణాలవల్ల పద్మవ్యూహంలో పతివ్రత సీరియల్ ఆపివేస్తున్నందుకు చింతిస్తున్నాం' అంటూ అనౌన్స్ చేసేసింది. ఆడవాళ్ళంతా మరోసారి గొల్లుమన్నారు. టి.వి వాళ్ళని, ఆ సీరియల్ ఆపించిన వారిని దుమ్మెత్తిపోసి ఆయాసంతో ఆగిపోయారు. మగాళ్ళ ఆనందం వర్ణనాతీతం అయితే తమ ఆనందాన్ని ఇంట్లో వ్యక్తీకరించలేదు.

మరుసటి ఆదివారం మంచి పార్టీచేసుకోవాలను కున్నారు. ఇంట్లో కూడా చెప్పకుండా ఓ స్టార్ హోటల్లో ఫుల్‌గా మందుకొట్టేసి,తృప్తిగా భోంచేసి, కిళ్ళీలు నములుతూ తూలుకుంటూ వారివారి వాహనాల్లో బయల్దేరారు మెల్లగా. తమ అవతారాలని చూసి భార్యలు చీపుళ్ళు తిరగేస్తారని గానీ, అప్పడాల కర్రలతో సత్కరిస్తారనిగానీ వాళ్ళకి భయంకలగలేదు. మందు మహిమ అలాంటిది మరి.

వాళ్ళు ఇల్లు చేరేసరికి పన్నెండయింది. అంత రాత్రిదాకా ఎక్కడ గడిపారో, ఏంచేశారో,ఎలాకథఅల్లి చెప్పాలీ అన్న ఆలోచన ఇళ్ళకి చేరేసరికి కలిగిందం దరికి, మత్తు కాస్తదిగింది. ఆ స్థానంలో భయం చోటుచేసుకుంది.

విశ్వం మెల్లగా తలుపు తీసుకుని లోపలికెళ్ళాడు అప్పటికి పిల్లలు గాఢనిద్రలో వున్నారు. కానీ భార్య కనిపించలేదు. ఇంత అర్ధరాత్రి ఎక్కడికెళ్ళిందా అనుకుంటూ అంతా గాలించాడు. అప్పుడతనికి కింద రిక్రియేషన్ హాల్లోంచి ఏవో మాటలు వినిపించి ఆశ్చర్యపోయాడు. ఇంతలో గంగ వచ్చి "అరె! వచ్చేశారా? ఏమిటి అలా వున్నారు! ఓ మందు పుచ్చుకున్నారా! అయితే డిన్నర్ కూడా అయిపోయుంటుంది. అంది మందహాసవదనంతో.

బిత్తరపోయాడు విశ్వం.

"నేను.....నేను..." అంటూ ఆగిపోయాడు. ఆమె నవ్వింది సమ్మోహనకరంగా" అంత హాయిగా నవ్వి ఎన్నాళ్ళయిందో" అనుకున్నాడతను.

"ఏంలేదు గంగా మా ఫ్రెండ్సంతా గొడవ చేస్తుంటే రెండే రెండే పెగ్గులు!" తలదించుకుని మెల్లగా అన్నాడు విశ్వం.

"తప్పదు, అప్పుడప్పుడు ఇలాంటి సరదాలు కూడా వుండాలి.'' మళ్ళీనవ్విందావె. ఆమె మొహంలో సీరియల్ ఆగిపోయిందన్న బాధ ఎక్కడా లేదు. నిజంగా విశ్వానికి వెర్రిఆనందం కలిగింది. ఆమె బుజం మీద చెయ్యేసి ఏదో చెప్పబోయాడు. అయితే ఆమె అతని చెయ్యపట్టుకుని–

"ఓసారి కిందికిరండి!" అంటూ లిఫ్టులో కిందికి తీసికెళ్ళింది. అక్కడ అపార్ట్‌మెంట్ ఆడవాళ్ళంతా ఏదో పెద్ద పార్టీకి అటెండయినట్లు అలకంకరించుకుని కూర్చున్నారు పెద్దగా నవ్వుకుంటూ

కొయ్యబారిపోయాడు విశ్వం.

వాళ్ళలా వున్నందుక్కాదు. అక్కడ కుర్చీలు, టేబుల్స్, వాటిమీద రకరకాల లిక్కర్సు, తినుబండారాలు అమర్చివున్నాయి. అప్పటికే పార్టీ మొదలయిపోయినట్టు చిందరవందరగా వున్నాయి. తమ తమ భార్యల కోసం వెతుక్కున్న వాళ్ళంతా అక్కడికి చేరిపోయి దాదాపు విశ్వంపరిస్థితిలోనే వున్నారు.

"కూర్చోండి. ఓ పెగ్గు తీసుకుంటారా?, భర్తకి గ్లాసు అందివ్వబోతూ అంది గంగ.

**ఆధునిక ఆటంబాంబు**

ధనం, రాజకీయం
కులం, మతం దాటికి
కలం, న్యాయం
రెండూ ముక్కలయ్యాయి.

– పరుచూరి శ్రీనివాసరావు
కోలవెన్ను

అప్పటికి తేరుకున్న విశ్వం–

"ఏమిటి నాన్సెన్స్?" అన్నాడు అరిచినట్లు అతని మాటలతో ధైర్యం వచ్చిన మిగతావాళ్ళుకూడా–

"ఏనాడూ లేంది ఈ పార్టీలేంటి, ఆడవాళ్ళయి వుండి, –.. అన్నారు ఆవేశంగా.

"ఏవిటి సార్! ఆడవాళ్ళకి మాత్రం సరదాలూ, ఆనందాలూ వుండకూడదా! మాకు వెర్రి ఆనందంగా వుంది. అందుకే ఈ పార్టీ అరేంజ్ చేసుకున్నాం. కావాలంటే మీరూ ఇందులో పాల్గొనవచ్చు" అంది రాజేష్ భార్య.

'వెర్రి ఆనందమా? ఏమిటది? చిరాగ్గా అన్నాడు సుబ్బారావు. "ఆనందంకాక ఏంటిసార్! పనికి మాలిన వెధవలెవరో ప్యాక్ట్‌గా మా అభిమాన సీరియల్ "పద్మవ్యూహంలో పతివ్రత" ఆపించేశారుగా మాలాంటి వారి కోరిక మేరకు పాత నిర్మాత దర్శకులని మార్చేసి శ్రీ లంబోదరంగారనే పెద్ద మనిషి తనే స్వంతంగాతీయబోతున్నాడు. వాళ్ళూ వాళ్ళూ ఏదో రాజీ చేసుకున్నారటలెండి అందుకే రేపట్నించే మళ్ళీ సీరియల్ మొదలవుతుంది.

అన్నట్టు మరో శుభవార్త!

ఆ సీరియల్ ఇంక యాభైవారాలేకదా వున్నది. కానీ లంబోదరం గారు దాన్ని మెగా మెగా సీరియల్‌గా మలచబోతున్నారట. అంటే ఇంక కనీసం అయిదొందల ఎపిసోడ్సయినా తీస్తామంటూ మధ్యాహ్నం అనౌన్సు చేశారు. మరి ఇది వెర్రి ఆనందం కలిగించే విషయం కాదూ?" అంటూ ఓ పెద్దలెక్చరిచ్చి గ్లాసులో మిగిలిన పెగ్గులాగించేసింది గంగ. అంతే రకరకాల శబ్దాలయ్యాయి ఒక్కసారిగా మరేంలేదు. అక్కడి కొచ్చిన మగాళ్ళంతా నిల్చున్న పాటున కుప్పకూలి పోయి గిలగిల కొట్టుకోసాగారు. అది చూసి–

"మనలాగే వీళ్ళకీ వెర్రిఆనందం వచ్చేసింది. అంటూ మరో బాటిల్ ఓపెన్ చేసింది మిసెస్ రాజేష్.

❖ ❖ ❖

**పదిలైన్లకు మించని అణువుల్లాంటి మినీ కవితలకు స్వాగతం.**


# చినుకు
## సాహిత్య మాసపత్రిక

27, 28. మూడవ అంతస్తు, దత్తా నయా బజార్,
రాజ్ యువరాజ్ థియేటర్ ఎదురుగా, గాంధీనగర్,
విజయవాడ - 520 003. సెల్ : 98481 32208

### వ్యాపార ప్రకటనలు

**లోపలి పేజీలలో :**

| | | |
|---|---|---|
| క్లాసిఫైడ్స్ (4 లైన్లు) | - | రూ. 150/- |
| 1/4 పేజీ (బ్లాక్ & వైట్) | - | రూ. 350/- |
| 1/2 పేజీ (బ్లాక్ & వైట్) | - | రూ. 700/- |
| ఫుల్ పేజీ (బ్లాక్ & వైట్) | - | రూ. 1,500/- |

**మల్టీకలర్ లో :**

| | | |
|---|---|---|
| కవర్ పేజీ లోపల | - | రూ. 3,000/- |
| కవర్ పేజీ వెనుక | - | రూ. 4,500/- |

ఎడిటర్